

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | మంగళవారం 20-05-2025 | సంపుటి - 24 | సంచిక - 18 | రూ : 4 | పేజీలు: 8




## రూల్స్ పాటించరు.. చలాన్ చెల్లించరు

- ఎడాపెడా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన
- గత ఏడాదిలో దేశవ్యాప్తంగా రూ.12,000 కోట్ల చలాన్ల జారీ
- అందులో రూ.9,000 కోట్ల పెనాల్టీ పెండింగ్
- కఠిన చర్యలే పరిష్కారం
- కార్స్ 24 'చలాన్ రిపోర్టు' వెల్లడి

**మే 19, హైదరాబాద్:** వాహనాల సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. అంతకు మించి ట్రాఫిక్ నేరాలూ పెరిగిపోతున్నాయి. వాహన యజమానులు, డ్రైవర్లు... ఎడాపెడా ట్రాఫిక్ నిబం ధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధిస్తున్నా పట్టించుకోవటం లేదు. వేస్తే వేసుకోండి... అనే ధోరణితో చలాన్లు చెల్లించకుండా మళ్లీ అవే తప్పులు చేస్తూ రోడ్లపై తిరుగుతున్నారు. ఆటోమొబైల్ రంగానికి చెందిన కార్స్ 24 అనే టెక్నాలజీ సంస్థ ఈ పరిస్థితిపై సర్వే చేసి 'చలాన్ రిపోర్టు' అనే నివేదికను రూపొందించింది. ఇందులోని వివరాల ప్రకారం.. గత ఏడాదిలో దేశవ్యాప్తంగా వాహనాలు/డ్రైవర్లకు ట్రాఫిక్

తరువాయి 2లో

## 5 లక్షల మందికి 'యువవికాసం'




- జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ
- నెలకు రూ.2 వేల కోట్లు ఖర్చుచేయనున్న ప్రభుత్వం
- 3 నెలల్లో యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యం

2లో

## బియ్యం కార్డు కావాలంటే పెళ్లి కార్డు తేవాలంట

- మార్పు చేర్పులకు సతాయింపులెన్నో
- పేరు తొలగించాలన్నా.. వయసు సరిదిద్దాలన్నా కష్టాలే
- నిబంధనల కొర్రీలు.. సర్వర్ పనిచేయక తిప్పలు

**మే 19, అమరావతి:** వాళ్లేమీ కొత్త కార్డులు అడగడం లేదు.. ఉన్న కార్డులోనే చిన్నచిన్న సవరణలు కోరుతున్నారు. దీనివల్ల ప్రభుత్వంపై పడే భారమేమీ ఉండదు. ఆధార్

తరువాయి 2లో




# వాళ్లు జైల్లో పెడితే.. మేం నీళ్లిస్తున్నాం

- గిరిజనులకు సాగునీరందిస్తున్న ఘనత మా ప్రభుత్వానిదే
- నాడు వరి వేస్తే ఉరి అన్నారు.. మేం సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్నాం
- 100 రోజుల్లో అచ్చంపేట నియోజకవర్గంలోని రైతులందరికీ సోలార్ పంపులు
- 'ఇందిర సౌర గిరి జల వికాసం' ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**మే 18, మహబూబ్‌నగర్ నాగర్‌కర్నూల్:** పోడు భూముల కోసం పోరాటం చేసిన గిరిజనులను జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిదైతే.. ఆ భూముల్లో బోర్లు వేసి సౌర విద్యుత్‌తో సాగునీరు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వరి వేస్తే ఉరి అని గత సర్కారు అంటే.. అదే రైతన్న సన్నధాన్యం పండించేలా చేసి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తూ కడుపు నింపుతున్నామన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాచారంలో జలంధర్ అనే గ్రామస్థుడు నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో ముఖ్యమంత్రి,

తరువాయి 2లో




## ప్రతి కుటుంబానికీ ఆరోగ్య బీమా!

- ఏపీఎల్ కుటుంబాలకూ వర్తింపు!
- ఆర్థిక శాఖకు చేరిన ఆరోగ్య ముసాయిదా
- ఏడాదికి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు

**మే 19, అమరావతి :** ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు (ఆరోగ్యశ్రీ) సేవలను బీమా విధానంలో అమలుచేసేందుకు

తరువాయి 2లో




## ప్రజల జీవితాల్ని మెరుగుపరచాలనే మీ తపన స్ఫూర్తిదాయకం





- మన కృషి భారత్‌తో పాటు అల్ప, మధ్యాదాయ దేశాలకూ ఉపయోగకరం
- భవిష్యత్తులో నేను ఏపీలో పర్యటించే నాటికి అద్భుతమైన ఫలితాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందిస్తూ బిల్‌గేట్స్ లేఖ

**మే 19, అమరావతి:** ఆధునిక సాంకేతికత, నూతన ఆవిష్కరణలతో పాలనను

తరువాయి 2లో

## మిస్ వరల్డ్ క్వార్టర్ ఫైనల్స్‌కు 48 మంది

- నేడు, రేపు టీహబ్‌లో కార్యక్రమాలు

**మే 19, హైదరాబాద్:** హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ సుందరి పోటీలు కీలక ఘట్టానికి చేరుకుంటున్నాయి. 109 దేశాల భామలు మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు పోటీపడుతుండగా.. అమెరికా కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా ఓషియానా కాంటినెంటల్ క్లస్టర్ల నుంచి వివిధ అంశాల వారీగా ఎంపిక ప్రక్రియ మొదలైంది. సోమవారం నిర్వహించిన టాలెంట్ కాంపిటిషన్ సెకండ్ రౌండ్ నుంచి క్వార్టర్ ఫైనల్స్‌కు 48 మందిని ఎంపిక చేశారు. ఇంకా ఈ విభాగంలో నేపాల్, హైతీ, ఇండోనేసియా సుందరీమణులు ప్రతిభను నిరూపించుకోవాల్సి

తరువాయి 2లో



# వాళ్లు జైల్లో పెడితే.. మేం నీళ్లిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు పూజలు చేశారు. ఆ తర్వాత అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ''ఎన్నికల వేళ ఎమ్మెల్యేగా వంశీకృష్ణను గెలిపించాలని కోరితే.. 50 వేలకుపైగా మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించారు.. ఇప్పుడు నా బాధ్యత మరింత పెరిగింది. అందుకే ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించాను. అచ్చంపేట నియోజకవర్గంలో బోరుబావి ఉన్న రైతులందరికీ 100 రోజుల్లో సోలార్ విద్యుత్ యూనిట్లు, పంపుసెట్లు అందిస్తాం. వారి అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన సౌర విద్యుత్‌ను విక్రయించి నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటాం.



### పేదల గుండెల్లో ఇందిరమ్మ..

తెల్లదొరలను తరిమేసి దేశానికి స్వేచ్ఛను ప్రసాదించింది కాంగ్రెస్ పార్టీనే. కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు 25 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంచింది. పాకిస్థాన్‌ను ఓడించి బంగ్లాదేశ్ ఏర్పాటుకు ఇందిరాగాంధీ చాకచక్యంగా వ్యవహరించారు. ప్రధాని అంటే ఎలా ఉండాలో తెలియజేశారు. పేదల గుండెల్లో.. తండాల్లో, పల్లెల్లో ఆమె కొలువై ఉన్నారు. అందుకే ఈ పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టాం.

### వరి వేస్తే ఉరి అన్నచోటే..

అప్పటి ముఖ్యమంత్రి వరి వేస్తే ఉరి అన్నారు.. ఆయన మాత్రం ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో వరిధాన్యం పండించి క్వింటా రూ.4 వేలకు విక్రయించారు. మా ప్రభుత్వం సన్నధాన్యం పండించిన రైతుకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. రైతులు గత యాసంగిలో 1.56 కోట్ల టన్నులు, వానాకాలంలో 1.35 కోట్ల టన్నుల ధాన్యం పండించారు. ఇప్పుడు ప్రతి నెలా 3.10 కోట్ల మందికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. పేదలు మూడు పూటలా కడుపునిండా భోజనం చేస్తున్నారు.

### శ్ర అదానీ, అంబానీలతో మన ఆడబిడ్డల పోటీ..

సౌర విద్యుత్ ఉత్పత్తి అంటే.. అదానీ, అంబానీలకే సాధ్యమని అందరూ అనుకునేవారు. కానీ, వారితోనే పోటీపడేలా మన ఆడబిడ్డల్ని తయారుచేస్తున్నాం. మహిళలు 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ఒప్పందాలు చేసుకున్నాం. వారిని పెట్రోల్ బంకులకు యజమానులను చేశాం. హైదరాబాద్‌లోని శిల్పారామం పక్కన మూడున్నర ఎకరాల్లో అతివలు వారి ఉత్పత్తులను విక్రయించేలా 106 స్టాళ్లు ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

### దేశంలోనే నంబర్ వన్..

నిత్యావసరాల ధరల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని కేంద్రమే చెప్పింది. శాంతిభద్రతల పరిరక్షణ, పన్నుల వసూలు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మొదటిస్థానంలో నిలిచాం. పాలమూరు వారికి పాలన చేతగాదని అవహేళన చేశారు. అయితే, మేం తట్ట, పార పనే కాదు.. పరిపాలన కూడా చేస్తామని ఏడాదిన్నరలోనే నిరూపించా'' అని సీఎం తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీలు రవి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# రూల్స్ పాటించరు.. చలాన్ చెల్లించరు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు 8 కోట్ల చలాన్లు విధించారు. ఈ చలాన్లపై చెల్లించాల్సిన పెనాల్టీ రూ.12,000 కోట్లు కాగా, ఇందులో చెల్లించని మొత్తం రూ.9,000 కోట్లు ఉండటం గమనార్హం. ఎన్ని ట్రాఫిక్ నిబంధనలు ఉన్నా, వాటిని పోలీసులు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నా వాటి ఉల్లంఘన మాత్రం ఆగటం లేదు. అధిక వేగం ప్రధానమైన నేరంగా వెల్లడైంది. చలాన్ పడితే పడిందిలే... అన్నట్లుగా ఎక్కువ మంది వ్యవహరిస్తున్నారు. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించటం, ట్రాఫిక్ నేరాలకు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటమే దీనికి పరిష్కారంగా కనిపిస్తోంది. ట్రాఫిక్ చలాన్లను చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలు, వాటి యజమానులు/డ్రైవర్లకు లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ) రద్దు చేయటం, వాహన బీమా ప్రీమియం పెంచటం, చట్టప్రకారం ఇతర చర్యలు తీసుకోవటం అవసరమని ఈ నివేదిక సూచించింది. ట్రాఫిక్ నేరాలకు పాల్పడటానికి వెనుకంజ వేసే పరిస్థితి కల్పించాలని పేర్కొంది.

### ప్రధానమైన ట్రాఫిక్ నేరాలు

* అధిక వేగం, * హెల్మెట్/ సీట్ బెల్ట్ ధరించకుండా నడపడం
* ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయటం
* సిగ్నల్ జంపింగ్/రాంగ్ సైడ్ డ్రైవింగ్

### ట్రాఫిక్ నేరాలకు ప్రధాన కారణాలు

* ఎంతో మంది వాహన యజమానులు, డ్రైవర్లు చలాన్లు వేస్తే వేయనీలే అనే నిర్లక్ష్య ధోరణితో ఉంటున్నారు.
* దాదాపు 60.3 శాతం మంది ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నారు. 20.4 శాతం మంది చలాన్లకు భయపకుండా ట్రాఫిక్ నేరాలు చేస్తూనే ఉంటున్నారు.
* కొంత మంది డ్రైవర్లు ట్రాఫిక్ నేరాలకు పాల్పడినప్పటికీ ట్రాఫిక్ పోలీసులకు లంచం ఇచ్చి చలాన్లు పడకుండా తప్పించుకుంటున్నారు.
* చలాన్లు పడుతున్న వాహనాల్లో 55 శాతం కార్లు, ట్రక్కులు తదితర నాలుగు చక్రాల వాహనాలు కాగా, 45 శాతం ద్విచక్ర వాహనాలు ఉంటున్నాయి.

# 5 లక్షల మందికి 'యువవికాసం'

హైదరాబాద్: నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం పథకం కింద తొలిఏడాది 5 లక్షల మందికి మంజూరుపత్రాలు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేయాలని, 3 నెలల్లో నెలకు రూ.2 వేల కోట్లు చొప్పున ఖర్చుచేసి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని భావిస్తోంది. ఈ పథకం కింద ఇప్పటికే జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 25 నాటికి జిల్లా మంత్రుల అనుమతితో లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేసేందుకు సంక్షేమశాఖలు సిద్ధమయ్యాయి.

### క్షేత్రస్థాయి పరిశీలన..

ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16.20 లక్షల దరఖాస్తులొచ్చాయి. లక్ష్యం మేరకు ఇందులో దాదాపు 5 లక్షల మంది యువతకు గరిష్ఠంగా రూ.4 లక్షల విలువైన యూనిట్లు మంజూరు చేయనున్నారు. యూనిట్ కేటగిరీలవారీగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం అంచనా వేసింది. రూ.లక్ష లోపు రుణాల కోసం నిర్దేశించిన లక్ష్యం కన్నా దరఖాస్తులు తక్కువగా, రూ.12 లక్షలు, రూ.24 లక్షల యూనిట్ల కేటగిరీ రుణాలకు భారీగా దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించింది. ఉదాహరణకు ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.24 లక్షల విలువైన యూనిట్లు 20 వేలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. దాదాపు 3.24 లక్షల మంది పోటీపడుతున్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ కింద 22 వేల యూనిట్ల కోసం 6.66 లక్షల మంది, ఈబీసీల్లో 8 వేల యూనిట్ల కోసం 32 వేల మంది దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయి కమిటీలు పనిచేస్తున్నాయి.

### అనర్హులకు అడ్డుకట్ట..

దరఖాస్తుదారుల్లో అనర్హులను తొలగించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఒకసారి సంక్షేమ కార్పొరేషన్ పరిధిలో లబ్ధి పొందినవారు ఐదేళ్లపాటు మరోసారి రుణం పొందేందుకు అనర్హులవుతారు. సంక్షేమ కార్పొరేషన్ల వద్ద ఉన్న డేటాబేస్‌తో దరఖాస్తులను పరిశీలించి అనర్హులను తొలగిస్తున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాలను ఆధార్ డేటాబేస్‌తో పరిశీలించి, సరైన ఖాతాలు ఇచ్చారా.. లేదా.. పరిశీలిస్తున్నారు. మండలాలు, జిల్లాలు, మున్సిపాలిటీలు, నగరపాలికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీల జనాభా ఆధారంగా యూనిట్ల ఖరారుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కుటుంబానికి ఒక్కరికే స్వయంఉపాధి పథకం మంజూరు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# బియ్యం కార్డు కావాలంటే పెళ్లి కార్డు తేవాలంట

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా.. ఓటీపీతో వెంటనే పూర్తి చేస్తే పేర్ల తొలగింపు లేదా జోడింపు వంటి సమస్య పరిష్కారమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా బియ్యం కార్డుదారుల సమస్యల్లో 80% పైగా ఇవే. కానీ అధికారులు మాత్రం వివాహ ధ్రువీకరణ పత్రాలో, విడాకుల పత్రాలో కావాలంటూ సతాయిస్తున్నారు. వివాహ పత్రాలు అవసరం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నా.. దరఖాస్తు చేయడానికి వెళ్తే అవి కావాల్సిందేనని సిబ్బంది అంటున్నారు. చనిపోయిన వారి పేర్లు తప్పితే.. ఇతరులకు కార్డుల నుంచి తమ పేరు తొలగించుకునే అవకాశం లేదు. ఇలాంటి సమస్యలు బోలెడు.. ఈ నెల 7వ తేదీ నుంచి 3,48,399 దరఖాస్తులు అందాయి. వాటిలో 75% పేర్ల జోడింపు కోరుతూ వచ్చినవే. కానీ దానికీ సమస్యలు వెంటాడుతున్నాయి. వీటికి సర్వర్ మొరాయింపు తోడైంది.

### వివాహ ధ్రువీకరణ కావాల్సిందే

పేదల్లో చాలామందికి వివాహ ధ్రువీకరణ పత్రాలుండవు. కానీ కొత్తగా పెళ్లయినవారు బియ్యం కార్డులో కుటుంబ సభ్యుడి పేరు చేర్చాలంటే.. వివాహ ధ్రువీకరణ కావాలంటున్నారు. దీంతో వారు కొత్తగా పెళ్లికార్డులు ప్రింటు చేయించుకుని, వాటిని పట్టుకుని సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. పెళ్లయిన 60 రోజుల్లోగా అయితే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. అంతకు మించితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. చాలామందికి పెళ్లయి ఎన్నో ఏళ్లు అవుతోంది. చలానాకు రూ.500.. కార్డు ప్రింటింగ్‌కు రూ.500, ఆపై ఖర్చులు రూ.34 వేల వరకు అవుతున్నాయి. దీనికితోడు విపరీతమైన జాప్యం అవుతోంది. ఈలోగా గడువు ముగుస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఉండే కల్యాణ మిత్రలను వైకాపా హయాంలో తొలగించడంతో ఇక్కట్లు మొదలయ్యాయి.

* వివాహ ధ్రువపత్రాలు అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే వివాహ నమోదు నంబరు, ఫొటో ఇస్తేనే దరఖాస్తు అప్‌లోడ్ అవుతోంది.
* కార్డులు విభజించుకోవాలంటే.. హౌస్‌హోల్డ్ నంబరు అడుగుతోంది. కొత్తగా ఇంటి నంబర్లు ఇవ్వకపోవడంతో చాలామంది నమోదు చేయలేకపోతున్నారు.

### * పేరు తొలగించుకోవాలన్నా తిప్పలే

* సరిహద్దు జిల్లాల్లోని ఆడపిల్లలు కొందరు పెళ్లయ్యాక పొరుగు రాష్ట్రాలకు వెళ్తుంటారు. అక్కడ కార్డులో పేరు చేర్చాలని అడిగితే ఏపీలోని కార్డులో పేరు తొలగించుకుని రావాలని చెబుతున్నారు. ఇక్కడ అడిగితే చనిపోయినవారి పేర్లే తొలగిస్తామని అంటున్నారు. దీంతో వారికి అక్కడ కార్డులో చోటు దొరకట్లేదు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు తదితర జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది.

### * హౌస్‌హోల్డ్ డేటా పాతదే.. విభజన కుదరదు

వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల కార్డులను రద్దుచేశారు. వారంతా పేదలే అయినా పింఛన్లు, ఇతర పథకాలకూ దూరమయ్యారు. కొత్త కార్డులు ఇవ్వట్లేదు. కుటుంబ విభజన అవకాశం లేకపోవడమే దీనికి కారణం. ప్రస్తుతం రేషన్‌కార్డులు ఉన్నవారి కుటుంబాల్లోనే సభ్యుల విభజనకు అవకాశం ఇచ్చారు. కుటుంబ (హౌస్‌హోల్డ్ డేటా) విభజనకు కూడా ఎనేబుల్ చేయాలని పలువురు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

### వయసు మార్చాలన్నా కష్టమే

కొంతమందికి పిల్లల వయసు 6 ఉంటే.. కార్డుల్లో 60 అని పొరపాటుగా పడింది. ఇలాంటివారు ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర ప్రయోజనాలకూ దూరమయ్యారు. కొన్నిచోట్ల ఆడవారిని మగవారిగా, మగవారిని ఆడవారిగానూ నమోదుచేశారు. ఇప్పుడివి మార్చాలంటే కుదరదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### * ఒంటరి మహిళలకు దక్కని ప్రభుత్వ ప్రయోజనాలు

50 ఏళ్లు పైబడిన వారు, పెళ్లయి పిల్లలు లేని వారే ఒంటరి మహిళల కింద దరఖాస్తు చేసేందుకు వీలుంటుంది. పిల్లలు ఉన్నా వారికి దూరంగా ఉంటున్న వారికి దరఖాస్తు చేసే అవకాశం ఉండడంలేదు. ఇలాంటి వారు పింఛను, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అందుకోలేకపోతున్నారు. భార్య, భర్త విడివిడిగా ఉంటున్నా వివాహ ధ్రువపత్రాలు కోరుతున్నారు. పత్రాల అవసరం లేకుండానే కార్డులిస్తామని ఇటీవల పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ చెప్పారు. కానీ అమలు కావడం లేదు.

## మిస్ వరల్డ్ క్వార్టర్ ఫైనల్స్‌కు 48 మంది

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు మిస్‌వరల్డ్ నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఎంపికైన వారూ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుతారు. టీ హబ్‌లో మంగళవారం, బుధవారం కాంటినెంటల్ ఫినాలేలు జరగనున్నాయి.

## ప్రతి కుటుంబానికీ ఆరోగ్య బీమా!

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన కసరత్తు కొలిక్కి వస్తోంది. బీమా విధానం అమలుపై వైద్య ఆరోగ్యశాఖ తయారుచేసిన ముసాయిదా ఇప్పుడు ఆర్థికశాఖ పరిశీలనలో ఉంది. దారిద్ర్య రేఖకు దిగువ.. ఎగువలతో (ఏపీఎల్, బీపీఎల్) సంబంధం లేకుండా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఉచితంగా వైద్య సేవలు అందించేలా ముసాయిదా రూపొందించారు. రాష్ట్రంలో 1.43 కోట్ల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయి. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న 1920 లక్షల కుటుంబాల వారికి కూడా షరతులు ఏమీ లేకుండా బీమా పథకాన్ని వర్తింపజేస్తారు. ఏడాదికి రూ.2.5 లక్షల విలువగల వైద్య సేవలు ఉచితంగా బీమా సంస్థ ద్వారా అందుతాయి. ఆపైన చికిత్సకు (రూ.25 లక్షల వరకు) అయ్యే ఖర్చు (హైబ్రిడ్ విధానం)ను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు భరించేలా ముసాయిదా రూపొందించారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను రెండు జోన్లుగా విభజించి, టెండర్ల ద్వారా బీమా కంపెనీలను ఎంపికచేస్తారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా ప్రస్తుతం ఏడాదికి రూ.25 లక్షల విలువైన చికిత్స ఉచితంగా అర్హులైన రోగులకు అందుతోంది.

### 'ఎన్‌హెచ్‌ఏ ఐటీ అప్లికేషన్' సూట్ వినియోగం!

నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) ఐటీ అప్లికేషన్ సూట్‌ను ఎన్టీఆర్ వైద్యా సేవా ట్రస్టు ఉపయోగించనుంది. బీమా విధానంలోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తారు. 2007లో తయారుచేసిన సాఫ్ట్‌వేర్‌నే ప్రస్తుతం ట్రస్టు వినియోగించుకుంటోంది. ఆసుపత్రిలో రోగి చేరినప్పటి నుంచి డిశ్చార్జి అయ్యేవరకు, రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులు, ఆసుపత్రుల నుంచి క్లెయిమ్స్ వచ్చినప్పుడు వాటిల్లోని అవకతవకలు వెంటనే గుర్తించేందుకు వీలుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఉపయోగపడనుంది. ఇప్పటికే ట్రస్ట్ పరిధిలో అందించే సేవల్లో అవకతవకలు జరిగితే గుర్తించేందుకు సామాజిక తనిఖీలు చేపట్టారు.

### ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా 2,250, ట్రస్టు పరిధిలో 770 చికిత్సలు

ప్రస్తుతం 30 రకాల స్పెషాలిటీలతో కలిపి 3,257 రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటిని అలాగే కొనసాగిస్తున్నారు. అయితే బీమా విధానంలో 2,250, ట్రస్టు ద్వారా మిగిలిన 770 చికిత్సలు రోగులకు అందుతాయి. ట్రస్ట్ అందించే 770 చికిత్సలు అంత అవసరమైనవి కాకపోవడం.. అనవసర వ్యయాన్ని తగ్గించుకోవడంలో భాగంగా బీమా విధానంలో ఈ 770 చికిత్సలను చేర్చకుండా ట్రస్టు పరిధిలోనే ఉంచారు. 26 జిల్లాలను రెండు జోన్లుగా విభజించి, ఏడాది కాల పరిమితితో టెండరు ద్వారా బీమా కంపెనీలను ఎంపిక చేస్తారు. ఆ తరవాత రెండేళ్ల వరకు బీమా కంపెనీలకు రెన్యువల్‌తో అనుమతులు కొనసాగించాలని ముసాయిదాలో పేర్కొన్నారు. సంప్రదింపుల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదంతో టెండర్లు పిలుస్తారు.

## ప్రజల జీవితాల్ని మెరుగుపరచాలనే మీ తపన స్ఫూర్తిదాయకం

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతం చేయడం, మరింత సులభతరంగా సేవల్ని అందించి ప్రజాజీవితాల్ని మెరుగుపరచాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు తపన, కృషి స్ఫూర్తిదాయకమని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, బిల్‌మెలిందా గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ కొనియాడారు. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన వంటి కీలక రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి గేట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌కే కాక భారత్‌తో పాటు అల్ప, మధ్యాదాయ దేశాలకూ ఎంతో ఉపయోగపడనుందని తెలిపారు. కీలక రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తక్కువ ఖర్చుతో పరిష్కార మార్గాలు కనుగొనడం, ప్రజలకు సులభతరంగా ఆయా సేవల్ని అందించే అంశాలపై ఈ ఏడాది మార్చిలో దిల్లీ వేదికగా చంద్రబాబు, బిల్‌గేట్స్ చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇరువురి సమక్షంలో పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని చంద్రబాబును అభినందిస్తూ ఇటీవల గేట్స్ లేఖ రాశారు. ''నేను భవిష్యత్తులో ఏపీలో పర్యటించే నాటికి ఈ ఒప్పందంలోని లక్ష్యాల్ని సాధించడం ద్వారా అద్భుతమైనఫలితాలు సాకారం కానున్నాయి. మెడ్‌టెక్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి మీరు చూపుతున్న శ్రద్ధతో పేదలకు అత్యంత నాణ్యత కలిగిన పరికరాలు తక్కువ ధరకు అందుబాటులోకి వస్తాయి'' అని లేఖలో బిల్‌గేట్స్ పేర్కొన్నారు.

### ఆరోగ్య రంగం బలోపేతానికి మీ ప్రణాళికలు ఆసక్తికరం

హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్ ద్వారా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయాలనే మీ ప్రణాళికలు ఆసక్తికరంగా అనిపించాయి. గర్భిణులు, చిన్నపిల్లల ఆరోగ్య రక్షణకు మల్టిపుల్ మైక్రోన్యూట్రియంట్ సప్లిమెంట్లు తదితరాలు ఎలా ఉపయోగపడతాయో చర్చించినందుకు ఆనందంగా ఉంది.

## ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు సిద్ధం: ఫోన్‌లో మాట్లాడుకున్న ట్రంప్, పుతిన్

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దాదాపు 2 గంటలపైనే ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. ఇటీవలే టర్కీలో రెండు దేశాల మధ్య నేరుగా చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ''రష్యా ఒక శాంతి ఒప్పందం కోసం ఉక్రెయిన్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంది. అందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో అంగీకరించాము. అయితే శాంతి స్థాపనకు సంబంధించి పలు నియమాలు ఉన్నాయి. అందులో ఈ ఒప్పందం ఎప్పటికి జరగవచ్చో వంటి అంశాలు సైతం ఉన్నాయి'' అని రిపోర్టర్లతో పుతిన్ పేర్కొన్నారు. శాంతి స్థాపన పురోగతికి కాల్పుల విరమణ ఒప్పందం నిబంధనలు సైతం నిర్ణయించాల్సి ఉంటుందని పుతిన్ తెలిపారు. అందులో దాని వ్యవధి ఉంటుందన్నారు. మరోవైపు ఉక్రెయిన్, దాని మిత్రదేశాలు తక్షణమే 30 రోజుల పాటు కాల్పులు విరమణ చేయాలని రష్యాను కోరాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలు ప్రారంభానికి మద్దతు ఇచ్చినందుకు ట్రంప్‌నకు పుతిన్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. శాంతి స్థాపన పురోగతికి పలు సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ రష్యా నిబద్ధతను ట్రంప్ అంగీకరించినట్లు పుతిన్ తెలిపారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య చర్చలు సరైన దిశలోనే సాగుతున్నట్లు పుతిన్ తెలిపారు. అయితే శాంతి స్థాపన అనేది సంఘర్షణలకు మూల కారణాలను పరిష్కరించడంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇరుదేశాల్లో శాంతి కోసం ఉత్తమమైన మార్గాలను వెతకడం ప్రస్తుతం ముఖ్యమని పేర్కొన్నారు.

# విలువలు కలిగిన రాజకీయాలకు సుందరయ్య నిలువెత్తు నిదర్శనం

*** సుందరయ్య వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు.**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విలువలు కలిగిన రాజకీయాలకు సుందరయ్య నిలువెత్తు నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక మంచికంటి భవన్లో దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది.ముందుగా సుందరయ్య చిత్ర పటానికి మచ్చా వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. సుందరయ్య భూస్వామి కుటుంబంలో పుట్టి కూడా చిన్ననాటి నుంచి అంటరానితనం కుల వివక్ష అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. పదమూడు ఏళ్ల వయసులోనే గాంధీజీ పిలుపుతో జాతీయ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. జాతీయ ఉద్యమంలో పనిచేస్తున్న క్రమంలో కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితుడై దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాడని అన్నారు. భారతదేశంలో భూసంస్కరణలు అమలు జరగాలని చట్టసభల్లో పదేపదే లేవనెత్తారని ఆయన గుర్తు చేశారు. మహత్తర వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి బాంచన్ దొరా నీ కాళ్లు మొక్కుతా




అనే బానిస విధానానికి వ్యతిరేకంగా కవులు రైతులు వ్యవసాయ కార్మికులు పేదలను ఐక్యం చేసి ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు నిర్వహించి నైజం నవాబును తరిమి కొట్టిన ధీరుడు అని కొనియాడారు. రాజకీయాలు అంటే ప్రజల బతుకులు మార్చేగా ఉండాలని రాజకీయాలలో విలువలు ఉండాలని తాను ఆచరించి నేటి భారత రాజకీయ ముఖచిత్రంపై ఒక చెరగని ముద్రగ సుందరయ్య ఉన్నారని కొనియాడారు. సుందరయ్య కోరుకున్న దోపిడీ లేని పేదోడి రాజ్యాన్ని స్థాపించడానికి చివరిదాకా ఎర్రజెండా ఎర్రజెండా బాటలో పోరాడటమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎంఎన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు సంతకూరు లక్ష్మి, నందిపాటి రమేష్, నాయకులు కృష్ణ, ఎంఎస్ ప్రకాష్, రమేష్ బాబు, ఎన్ఎస్ రాజు, కొలిపాక వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, రాములు, రఘు, సంధ్య, నాగదుర్గ, రమ, భారతి, రామకోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక టీచర్లకు ప్రత్యేక శిక్షణా తరగతులు




ప్రజాస్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం:ఈనెల 20 నుండి ఐదు రోజులపాటు 24 వరకు నిర్వహించే మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను అత్యంత సౌకర్యంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ కోరారు. సోమవారం మండల రిసోర్స్ పర్సన్లతో ముందస్తు సిద్ధపాటు సమావేశాన్ని నిర్వహించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడే విధివిధానాల గూర్చి వారితో వివరంగా విశ్లేషించారు. తోటి ఉపాధ్యాయులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అర్థవంతంగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఉమ్మడిగా చర్చిస్తూ నూతన బోధనా కృత్యాలను ఆవిష్కరిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో తరగతులు ఆహ్లాదకరంగా నిర్వహించబడేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. వేసవి కావున చల్లని నీరు, మజ్జిగ అందించాలన్నారు. ప్రభుత్వ సంకల్పం మేరకు సకల విద్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో లక్ష్మీదేవి పల్లి యంఇఓ కృష్ణయ్య, విషయ నిపుణులు, రిసోర్సు పర్సన్లు, ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల డివిజన్ శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విశ్వకర్మ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాత్కాలికమైన దేహం కోసం శాశ్వతమైన ఆత్మ కోసం జీవించాలని ప్రపంచానికి చాటిన మహా యోగి శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, కాలే నాగేష్, నరేందర్ రెడ్డి,సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, కాలే గణేష్, నదీమ్ రాయ్, మోహన్ రెడ్డి, బాల మల్లేష్, విజయ్ హరీష్, సత్యనారాయణ యాదవ్, ఆలయ చైర్మన్ అన్నోజు భానురి కృష్ణమాచారి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాస్ఫూర్తి, ఇల్లెందు: పిడుగుపడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన విషాద ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం కట్టుగూడెం గ్రామంలో సోమవారం చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం సాయంత్రం ఇల్లందులో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో కట్టుగూడెం గ్రామంలో వ్యవసాయ అవసరాల నిమిత్తం పరిటాల పుల్లయ్య (44), అతని సోదరుడు వెంకటేశ్వర్లు బావి తవ్విపిస్తున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకోవడం, ఉరుములు, మెరుపులు వస్తుండటంతో వారిరువురూ దగ్గరలోని వేపచెట్టు కిందకు వెళ్లారు. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు వేపచెట్టుమీద పడటంతో ఆ చెట్టు కింద ఉన్న పరిటాల పుల్లయ్య మృతిచెందగా, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని ఇల్లందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతున్నాడు. పుల్లయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## భూమిలో కరిగిపోయే సంచులను ప్రోత్సహించాలి

*** బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్**

*** రమణి ఇండస్ట్రీస్ ఉత్పత్తులు అద్భుతం**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : పర్యావరణాన్ని రక్షించేందుకు రమణి ఇండస్ట్రీస్ లో ఉత్పత్తి చేస్తున్న భూమిలో కరిగిపోయే సంచుల తయారీ ప్రశంసనీయమని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్ అన్నారు. ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా మట్టిలో కరిగిపోయే సంచులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం హరిత పారిశ్రామిక పార్కులోని రమణి బయో కాంపోస్టిక్ పరిశ్రమను ఆయన సోమవారం సందర్శించారు. డి ఆర్ డి ఓ శాస్త్రవేత్తలు అందించిన సాంకేతిక సహకారంతో రమణి, డాక్టర్ ప్రసాదులు నెలకొల్పిన రమణి ఇండస్ట్రీస్ లో బయో డి గ్రేడబుల్ సంచులను తయారు చేసే ప్రక్రియను పరిశీలించారు. మొక్కజొన్న పొట్టుతో తయారయ్యే గ్రాన్యూల్స్ ను ఉపయోగించి వివిధ రకాల క్యారీ బ్యాగులను, రైతులు ఉపయోగించే మల్చింగ్ షీట్లను తయారు చేసే యంత్రాలను, వాటి నుంచి తయారుచేసిన సంచులను, ఆ సంచులపై సంస్థల పేర్లను ముద్రించే పద్ధతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాపారం కోసం కాకుండా సమాజానికి పర్యావరణానికి తమ వంతుగా కృషి చేయాలని సంకల్పంతో ఈ పరిశ్రమను స్థాపించామని రమణి డాక్టర్ ప్రసాదులు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ కు వివరించారు. ఈ సంచులను ఉపయోగించి భూమిలో ఎక్కడ పడవేసిన 90రోజులలో అవి మట్టిలో భూమికి ఎరువుగా ఉపయోగపడతాయని వివరించారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో తాము స్వయం ఉపాధి పొందడంతో పాటు ఈ ప్రాంతంలోని కొంతమందికి పని కల్పించగలుగుతున్నామని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ కు వివరించారు. బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులను ప్రోత్సహించి తమకు సహకారం అందించాలని కోరారు.

*** పర్యావరణ రక్షణ అందరి బాధ్యత**

**- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్**

రమణి ఇండస్ట్రీస్ లో తయారవుతున్న బయో డి గ్రేడబుల్ సంచులను ప్రోత్సహించాల్సిన, ఎగుమతి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను విరివిగా వాడుకుని పడవేస్తే అవి భూమిలో కరగడానికి వందల సంవత్సరాలు పడుతుందని పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని వివరించారు. వాటికి ప్రత్యామ్నాయంగా కొన్ని రోజుల్లోనే భూమిలో కరిగిపోయే ఇలాంటి బయో డి గ్రేడబుల్ బ్యాగులు ఉత్పత్తి, వినియోగం జరగాలన్నారు. సామాజిక సేవా దృక్పథంతో బయోడిగ్రేడబుల్ బ్యాగుల తయారీ పరిశ్రమను నెలకొల్పిన రమణి డాక్టర్ ప్రసాద్ లను ఆయన అభినందించారు. వీటి మార్కెటింగ్ కు ఎగుమతులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. టిఫ్ కార్యాలయానికి వెళ్లి హరిత పారిశ్రామిక పార్కు విశేషాలను తెలుసుకున్నారు. టిఫ్ మేనేజర్ శ్రీకాంత్ హరిత పారిశ్రామిక పార్కు ప్రగతిని వివరించారు.



## భారతీయ హస్తకళలు అద్భుతం

*** బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గానేత్ విన్ ఓవెన్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారతీయ హస్తకళలు అద్భుతమైన వని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గానేత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం టెక్స్ టైల్ పార్కులోని మిమీ క్రాఫ్ట్ హస్తకళల కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. గిరిజన కళతో తయారుచేసిన అలంకరణ వస్తువులను పరిశీలించారు. ప్రాచీనమైన "బాతిక్ " పద్ధతిలో వస్త్రాలకు మైనాన్ని పూసి వివిధ రకాల ఆకృతులతో రంగులు అద్ది ఫ్యాషన్ వస్త్రాలు తయారుచేసే పద్ధతిని తిలకించారు. భారతీయులు పూర్వకాలం నాటి పద్ధతిలో పత్తితో నేసిన నూలుపై టై అండ్ డై, స్క్రీన్, బ్లాక్ ప్రింటింగ్ చేసి చీరలు, డ్రెస్ మెటీరియల్ తయారు చేస్తున్న హస్త కళాకారుల పనితనాన్ని పరిశీలించారు. తాను స్వయంగా బ్లాక్ ను చేత పట్టుకొని రంగులో ముంచి వస్త్రంపై ప్రింటింగ్ చేసి భారతీయ హస్తకళలపై తన అభిమానాన్ని చాటుకున్నారు. హస్త కళాకారులను, ప్రాచీన హస్తకళలకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్న కృష్ణమూర్తి, పుష్పలత లను ఆయన అభినందించారు. భారతీయ హస్తకళల గురించి తనకు పరిచయం చేసినందుకు హర్షం వ్యక్తం



చేశారు. ఈ సందర్భంగా మిమి క్రాఫ్ట్ నిర్వాహకుడు, ఫ్యాషన్ డిజైనర్ కే. కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ హస్త కళలు ఎంతో ప్రాచీనమైనవని, విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందాయని తెలిపారు. యాంత్రికరణ, పారిశ్రామికీకరణ పెరిగినా కూడా ఈ భారతీయ హస్త కలలకు గౌరవం పెంచేందుకు, ఇవి అంతరించిపోకుండా కాపాడేందుకు ప్రాచీనతకు, ఆధునికతను జోడించి తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మిమీ క్రాఫ్ట్ నిర్వాహకురాలు పుష్పలత బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ను హస్తకళ శాలువాతో సన్మానించారు.

## వాహనాల పన్నులు వెంటనే చెల్లించాలి

*** వరంగల్ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పురుషోత్తం**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఉన్న వాహనాలన్నిటికీ పన్నులు విధిగా చెల్లించాలని వరంగల్ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పురుషోత్తం అన్నారు. సోమవారం కొత్తగూడెం రవాణా శాఖ కార్యాలయ పరిశీలనకు విచ్చేసిన వరంగల్ డిప్యూటీ రవాణా శాఖ కమిషనర్ పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు నిర్ణీత సమయంలో విధిగా పన్నులు చెల్లించాలని లేనియెడల అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బస్సుల ఫిట్నెస్ మరియు పన్నుల చెల్లింపులు పూర్తి చేయాలని తెలిపారు. మున్సిపల్ వాహనాలు విధిగా రోడ్డు పన్ను చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వాహనాలన్నింటికీ నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, కొత్తగూడెం ఎం వి ఐ మనోహర్, ఎంవిఐ నిర్మలారెడ్డి, భద్రాచలం ఎం వి ఐ వెంకట పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుడు హరి కుమారుడు సోమశేఖర్ మృతిపై విచారణ జరపాలి

*** సోమశేఖర్ మృతిపట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సంతాపం**



ప్రజాస్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ శాఖలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న మేడి హరి కుమారుడు మేడి సోమశేఖర్ (15) అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సంబంధిత పోలీస్ శాఖా అధికారులను కోరారు. సోమశేఖర్ మృతదేహాన్ని సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ సోమశేఖర్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, ఈ అనుమానాలను నివృత్తి చేయాలనీ, న్యాయ విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలనీ కోరారు. తల్లిదండ్రులకు కడుపు కోత తీర్చలేనిదని, తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని కోరారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు లగడపాటి రమేష్, బత్తుల నాగరాజు,నవీన్, సుధాకర్ తదితరులు వున్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం...



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని చెరువు కట్ట కాళీమాత దేవస్థాన ప్రాంగణం వేంచేసియున్న శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవము సోమవారం వైభవంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజాస్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: 202425 విద్య సంవత్సరం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే నెల 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈసారి పరీక్షల్లో ఆదివారం కూడా పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం7635 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్ రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారికి సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు పరీక్ష కేంద్రాలకు చేరే విధంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ కు సూచించారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తెలియజేశారు. పరీక్షలు పూర్తైన తర్వాత జవాబు పత్రాల బండల్లను పోస్టల్ శాఖ వారు తమ ఆధీనంలోకి తీసుకుని ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా నిర్ణీత ప్రాంతాలకు జాగ్రత్తగా చేర్చాలని పోస్టల్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు సజావుగా కొనసాగేలా అందరు సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి, మూత్రశాలలు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమిస్తూ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీ. సీ. కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృశ్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి సిహెచ్ వెంకటేశ్వరరావు, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, డిప్యూటీ డిఎంహెచ్వో జయలక్ష్మి, పోలీస్ శాఖ నుండి ఎస్ బి ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాస్, ట్రాన్స్ కో, పోస్టల్ శాఖ ఏ ఎస్ పి చిన్న యాకయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ అహ్మద్, జిల్లా పంచాయతీ కార్యాలయం నుండి రమణారావు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## పేదవారికి సహాయసహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలి

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఎక్కువ మంది పేదవారికి సహాయసహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో ఉన్న వృద్ధ నిరుపేద మహిళలకు బియ్యము , నిత్యావసర సరుకులను సోమవారం ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తమ డివిజన్ లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు ఆలేఖ్యకు , వారి బృందానికి కృతజ్ఞతలు తెలియచేసారు. మా డివిజన్ లో పేద మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని కాబట్టి అటువంటి వారిలో ఒంటరిగా జీవిస్తూ నిరుపేదలైన వృద్ధ మహిళలను ఎంపికచేసి వారికి బియ్యం , కిరాణా సరుకులు అందించడం జరిగిందని అన్నారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు చేస్తూ, సమాజసేవ చేయాలనే మంచి ఉద్దేశంతో బృందంగా ఏర్పడి ఎంతోమంది పేదవారి బ్రతుకుల్లో వెలుగులు నింపుతున్న హోప్ ఆఫ్ హాంగర్ సంస్థ రానున్న రోజుల్లో మరింత మందికి సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షౌకత్ అలీ మున్నా, వెంకటేశ్వరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22న కూకట్ పల్లిలో హిందూ ఏక్తా యాత్ర



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 22న బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ కాలనీలో కూకట్ పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో హిందూ ఏక్తా యాత్రను నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛభారత్ అభియాన్ కన్వీనర్ పవన్ సోమవారం ప్రకటించారు. ముందస్తు ఏర్పాటు చేసిన సమావేశంలో యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్, కాషాయ అలంకరణ, ఉత్సవ విగ్రహాలు, రథం, ప్రసాద వితరణ, త్రాగు నీరు, పోలీసు బందోబస్తు వంటి అనేక అంశాలపై కమిటీ సభ్యులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులు వినోద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కూకట్ పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు, బాలాజీ నగర్ కాలనీ శ్రీ సంజీవిని హనుమాన్ దేవాలయం నుండి కూకట్పల్లి రామాలయం వరకు పెద్ద ఎత్తున హిందూ ఏక్తా యాత్ర ఉంటుందని తెలిపారు. కూకట్పల్లి గ్రామంలో నాలుగేళ్లుగా ఈ యాత్రకు ఎంతో ప్రాధాన్యత సంతరించకుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాత్ర నిర్వాహకులు బి.వినోద్, సోమశేఖర్ రెడ్డి, తోట రమేష్, భగవంత్ రెడ్డి, గట్ల సంతోష్, ప్రేమ్ కుమార్, సాయి, శివ, సురేష్, రాజు, రవి, విజయ్ , స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## శ్రీశైలంలో శిఖర దర్శనంతో మోక్షం

*** ఇక్కడి రాజగోపురం దర్శనంతోనే శివా అనుగ్రహం**

మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నేరేడ్మెట్ ప్రధాన రోడ్డులో ఉన్న శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం ఏర్పడి 100సంవత్సరాలు అవుతున్న సందర్భంగా భారీ స్థాయిలో నిర్మించిన ఆలయ రాజగోపురం ప్రారంభోత్సవం సోమవారం ఉదయం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ తాండవ కాశీ క్షేత్రం పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ రాక సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఆయన నేరుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో ఐదు కలశాలకు స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించి యంత్ర ప్రతిష్ట, సతీసమేత నవగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామదేవతలు శ్రీ నల్ల పోచమ్మ ,శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్ల వాహన యంత్ర ప్రతిష్టలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపరులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద



సరస్వతి స్వామీజీ అనుగ్రహ భాష్యమిస్తూ శ్రీశైలంలో శిఖర దర్శనం వల్ల ముక్తి లభిస్తుందని , నేరేడ్మెట్ లోని శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయ రాజగోపురం సందర్శిస్తే శివానుగ్రహం కలుగుతుందని స్వామీజీ స్పష్టం చేశారు. ఇక్కడి ఆలయం మంచి క్షేత్రంగా విరాజిల్లుతుందని శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథుడు ఇక్కడ సాక్షాత్తుగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం పండ్లు పూలు దక్షిణ సమర్పించారు. అనంతరం స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ రాజగోపురం యంత్ర శిఖర ప్రతిష్ట సందర్భంగా భారీ స్థాయిలో భక్తజనం తరలివచ్చారు. నేరేడుమెట్ పరిసర ప్రాంతాలలోని వివిధ దేవాలయాల కమిటీ వారు ఆలయ రాజగోపురం సందర్శించారు ఈ సందర్భంగా పలువురు దాతలను , ఆలయాల కమిటీల నిర్వాహకులను శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు గత మూడు రోజులుగా కొనసాగిన రాజగోపురం శిఖర ప్రతిష్ట పూజలు వైభవంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ జిఎం రమేష్, అధ్యక్షులు బి ఎం రాజారామ్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ రాజు ,ఆలయ ప్రధాన కార్యదర్శి గంగాధరి రాజు, సామల సత్యనారాయణ, రియల్ విజయ్ కుమార్,గంగాధర్ కృష్ణ, కొత్తింటి అశోక్, ఎలిమెల గణేష్, బడే మనోజ్, సువర్ణ లక్ష్మి, జంగిలి శివకుమార్, కట్టెల నరేష్, మధ్యలో సుధాకర్, ఆకుల సంతోష్, జంగిలి మహేశ్వరి, ఆకుల మీనా, ఉమాదేవి, భువనేశ్వరి, గంగాధరి నేహా తో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు గంటలపాటు ట్రాఫిక్ పోలీస్ అధికారులు రోడ్ డైవర్షన్ చేసి రాజగోపురం శిఖర ప్రతిష్ట సజావుగా జరిగేందుకు సహకరించారు.



## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పట్ల వివక్ష తగదు

*** సిఐటియు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్.**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులు అందరూ ఎక్కువమంది దళితులేనని వారి వేతనాలు ప్రభుత్వం పెండింగ్లో పెట్టడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం వీరి పట్ల వివక్ష చూపటం దారుణమన్నారు. ప్రభుత్వము, అధికారులు దళిత ఉద్యోగుల వేతనాలు పెండింగ్ పెట్టడం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద ఎందుకు రాదు అని ప్రశ్నించారు. ఈ విషయమై కమిషనర్ స్పందిస్తూ మా స్థాయిలో మేము ప్రయత్నం చేస్తున్నామని స్టేట్ ఫైనాన్స్ వద్ద పెండింగ్ ఉన్నదని అది ప్రభుత్వం ఎంత త్వరగా క్లియర్ చేస్తే అంత త్వరగా వస్తుందని వాపోయారు. క్రింది స్థాయి ఉద్యోగుల పట్ల ఉన్నతాధికారులు ప్రభుత్వం ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చిన్నచూపు చూడటం సరికాదన్నారు. సిఐటియుగా కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల వేతనాలు పెండింగ్ బాధ్యత ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర ఆర్థిక మంత్రి సామాజిక వర్గం కూడా దళిత సామాజిక వర్గమేనని , పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టు ఉద్యోగుల కష్టాలను గుర్తించి కార్మికులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇతర విషయాలకు సంబంధించి కార్మికులకు నెలకు రెండేసి సబ్బులు ఇవ్వాలని కోరారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సబ్బులు, కొబ్బరినూనెను చీపుర్లు పంపిణీ చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. డ్యూటీలో ఉన్న కార్మికులకు ప్రమాదం జరిగినప్పుడు పనికి రాలేనన్ని రోజులు వేతనం కట్టి ఇస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పే స్లిప్పులు , ఐడి కార్డులు వెంటనే ప్రిపేర్ చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనారాయణ, రాముడు, లింగమ్మ ,అలివేలు, లక్ష్మి, మనీ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గుల్జార్‌హౌస్ వద్ద ఘటనపై నివేదిక ఇవ్వండి.. మానవహక్కుల సంఘం ఆదేశం

హైదరాబాద్: గుల్జార్ హౌస్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర మానవహక్కుల సంఘం స్పందించింది. ఘటనను సుమోటోగా స్వీకరించిన కమిషన్ ఛైర్మన్.. కేసును విచారించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. భవన భద్రత, విద్యుత్ నిర్వహణపై మీడియాలో కథనాలు రావడంతో కమిషన్ స్పందించింది. 17 మంది మృతిపై జూన్ 30లోగా నివేదిక సమర్పించాలని సీఎస్‌తోపాటు హైదరాబాద్ సీపీ, అగ్నిమాపక డీజీ, టీఎస్‌ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేసింది. చార్మినార్ పరిధి గుల్జార్‌హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- **ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ**
- **యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ళు వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్ని ధాన్యపు రాశులు ఉన్నాయి, రోజుకు ఎంత ధాన్యం తూకాలు వేసి మిల్లులకు పంపిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఆరబెట్టిన ధాన్యాన్ని మ్యాచర్ చూసి, వెంటనే తూకాలు వేసి, ఏసి మిల్లులకు పంపించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పిఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి కొనుగోలు కేంద్రాలలో ఉన్నపలు సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రవాణా సమస్య ఎక్కువగా ఉందని, రైస్ మిల్లుల వద్ద దిగుమతికి 2, 3రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని విన్నవించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ హనుమంతరావు డీఎస్ఓ కు ఫోన్ ద్వారా రైస్ మిల్లర్ల వద్ద దిగుమతి గురించి అడిగారు. దానికి డీఎస్ఓ మిల్లర్ పూసల గోదాం తీసుకున్నారని, 50మంది హమాలీలు కూడా ఉన్నారు. రేపటి నుంచి దిగుమతి త్వరగా జరుగుతుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, ఏఈఓ శంకరయ్య, గిర్కంటి నిరంజన్ గౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, చిన్నం బాలరాజు, పిఏసిఎస్ కార్యదర్శి వై.రమేష్, రైతులు పాల్గొన్నారు.

## బిజెపి మండల కమిటీ విస్తరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి చౌటుప్పల్ మండల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. మండల కమిటీ విస్తరణ మండల అధ్యక్షుడు కైరం కొండ అశోక ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులుగా నాటి మల్లేశం గౌడ్, పొట్టబత్తిని బాలరత్నం, ఊదరి దివ్య, పులిగిల్ల శ్రీనివాస్ చారి, పర్నే శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పబ్బతి శేఖర్ గౌడ్, యాస అశోక్ రెడ్డి, కార్యదర్శులుగా బర్మా నాగరాణి, చింతల ఎలేష్ యాదవ్, పగిళ్ల లింగారెడ్డి, కొలను జనార్దన్ రెడ్డి, బాలగోని లింగస్వామి యాదవ్, కోశాధికారిగా ఎరుకల కల్పన, కార్యవర్గ సభ్యులుగా వనం సత్యనారాయణ, తోకల మహేందర్ రెడ్డి, కొయ్యడ స్వామి గౌడ్, ఆకారపు శివ, బద్దం రవీందర్, బోయ అంజలి, తాటి అశ్విని, కంచర్ల పవిత్ర, పకీరు పారిజాత, పసనగోని గీతలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో గుజ్జుల సురేందర్ రెడ్డి, ఊడుగు యాదయ్య గౌడ్, బత్తుల జంగయ్య గౌడ్, బాతరాజు సత్యం, కట్ట కృష్ణ, అల్మాస్ పేట గౌతమ్, పబ్బు వంశీ గౌడ్, మన్నె జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిరాణం అండ్ జనరల్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

**: అధ్యక్షునిగా కామిశెట్టి వెంకటేశం గుప్త**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ కిరాణం అండ్ జనరల్ అసోసియేషన్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం అసోసియేషన్ భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా కాంశెట్టి వెంకటేశం గుప్త, ఉపాధ్యక్షులుగా కైరం కొండ వెంకట నరసయ్య, ఊర కృష్ణమూర్తి గుప్త, ప్రధాన కార్యదర్శిగా లింగాల లింగస్వామి గౌడ్, కోశాధికారిగా తడకమల్ల శ్రీనివాస్ గుప్త, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గుత్తా సురేందర్ రెడ్డి, బి వీరోజి, సహాయ కార్యదర్శులుగా చల్లా మహేందర్ రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ గుప్త, సంయుక్త కార్యదర్శిగా గోరంటి నరసింహారాజు, కార్యవర్గ సభ్యులుగా ఉప్పల కృష్ణ గుప్తా ఎర్ర వెంకటేష్ గౌడ్, గట్టు సాయికిరణ్ గుప్త, గుడుగుంట్ల వెంకటేష్, మంచికంటి శంకర్ గుప్త, గౌరవ అధ్యక్షునిగా ఢిల్లీ శంకర్ రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు నూతన పాలకమండలిచే ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ సలహాదారులుగా వీసం చంద్రారెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త, గోశిక సత్యనారాయణ, గట్టు ప్రభాకర్ గుప్తలు ఎన్నికయ్యారు. ఈ ప్రమాణ స్వీకార మనకు ముఖ్యఅతిథిగా చౌటుప్పల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య హాజరై ఉపన్యసించారు. వాణిజ్యం ఒక యోగం లాగా నిర్వహించాలన్నారు. నాణ్యమైన సరుకులు అందజేస్తూ వినియోగదారుల ప్రశంసలకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ శ్రీ చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కిరాణా మరియు నిత్యవసర వస్తువులు ప్రజలకు సరసమైన ధరలకు అందిస్తూ సమాజానికి సేవ చేయడంలో కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, పెద్దిటి బుచ్చిరెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, బోయ దేవేందర్, కడారి కల్పన, సుర్వి నరసింహ, ఉడుగు మల్లేష్, మంచి కంటి భాస్కర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



## సిద్దిపేటలో ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు అదృశ్యం



సిద్దిపేట పట్టణం: పట్టణంలోని ఖాదర్‌పుర వీధిలో నివసించే ఓ కుటుంబంలోని ఐదుగురు అదృశ్యమయ్యారు. శనివారం ఉదయం నుంచి వారు కనిపించట్లేదు. ఫోన్లను ఇంట్లోనే వదిలేసి వెళ్లారు. స్థానికులు, బంధువులు ఏదైనా ఊరికి వెళ్లారని అనుకొని ఊరుకున్నారు. కానీ, రెండ్రోజులైనా వారి జాడ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరబత్తిని బాలకిషన్‌కు అప్పులు ఉన్నాయని, తనకు డబ్బులు ఇచ్చేవారు ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు లేఖ రాసి పెట్టారని బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలకిషన్ తండ్రి జనార్దన్, భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్, కుమార్తెలు కావ్య, శిరీష కనిపించట్లేదని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వారి ఆచూకీ కని పెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ మధు తెలిపారు.

## ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు నిధులు విడుదల: పొంగులేటి



హైదరాబాద్: ఇప్పటి వరకు 5,364 ఇందిరమ్మ ఇళ్లకు రూ.53.64 కోట్లు చెల్లించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 21,104 ఇళ్ల గ్రౌండింగ్ జరిగిందన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. బేస్‌మెంట్ పూర్తయిన 1,383 ..గోడలు కట్టిన 224 ఇళ్లకు రూ. 16.07 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

## వరంగల్ రైల్వే స్టేషన్ కొత్త లుక్.. రైల్వే మంత్రి ఆసక్తికర ట్వీట్




అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. రైల్వే స్టేషన్లకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు స్టేషన్ బిల్డింగ్ రూపురేఖలు, వెయిటింగ్ రూమ్స్, టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత వైఫై సౌకర్యంతో పాటు చుట్టుపక్కల నగర ప్రాంతాలతో స్టేషన్లను అనుసంధానించే పనులు చేపడుతున్నారు. అమృత్ భారత్ పథకం కింద తెలంగాణలోని వరంగల్ రైల్వే స్టేషన్‌లో రూ.25.41 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. తెలంగాణ అమృత్ స్టేషన్ వరంగల్ ఫిబ్రవరి 2024 శంకుస్థాపన జరిగిందని, మే 2025న అభివృద్ధి పనులు దాదాపు పూర్తి కావోస్తోందని వరంగల్ రైల్వే స్టేషన్ ప్రస్తుత న్యూ లుక్ ఫోటోలను కేంద్ర మంత్రి షేర్ చేశారు. మరోవైపు రైల్వే మంత్రి ట్వీట్‌ను బీజేపీ తెలంగాణ స్టేట్ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రీ ట్వీట్ చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద, తెలంగాణలోని వరంగల్ రైల్వే స్టేషన్‌లో రూ.25.41 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో తలపెట్టిన ఈ పునరుద్ధరణ పనులు ముగింపు దశలో ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలను మెరుగుపరచడంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఎక్స్ వేదికగా షేర్ చేశారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 117 (ఆంధ్రప్రదేశ్ లో 73, తెలంగాణలో 40) రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం తీర్చిదిద్దుతున్న విషయం తెలిసిందే.

## తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు



**చురుగ్గా నైరుతి రుతుపవనాలు**

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఇంటర్ విద్యార్థులకు బిగ్ అలర్ట్.. హాల్‌టికెట్లు విడుదల




రాష్ట్రంలో ఈ ఏడాది నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు గత నెల(ఏప్రిల్)లో తెలంగాణ ఇంటర్ బోర్డు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, తక్కువ మార్కులు వచ్చాయని భావిస్తున్న విద్యార్థులకు ఇంప్రూవ్‌మెంట్ ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్ కూడా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ మొత్తం 4,12,724 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు 50 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ తరుణంలో.. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు తాజాగా అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు విడుదల చేసింది. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల(మే) 22 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇక, ఈ ఏడాది జరగనున్న సప్లిమెంటరీ ఎగ్జామ్స్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ క్రమంలో విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ https://tgbie.cgg.gov.in/ ద్వారా తమ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు తమ రోల్ నంబర్, పాత హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## తెలంగాణలో భారీగా డీఎస్పీలు బదిలీ




తెలంగాణ పోలీస్‌శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో భారీగా డీఎస్పీలను బదిలీ చేసింది. మొత్తం 77 మందిని బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డీఎస్పీగా వెంకటస్వామి, బాలానగర్ ఏసీపీగా నరేశ్ రెడ్డి, శంషాబాద్ ఏసీపీగా శ్రీకాంత్ గౌడ్, మాదాపూర్ ఏసీపీగా సీహెచ్ శ్రీధర్, చిక్కడపల్లి ఏసీపీగా శ్రీకాంత్, మేడ్చల్ ఏసీపీగా శంకర్ రెడ్డి, సంతోష్‌నగర్ ఏసీపీగా సుఖ్‌దేవ్‌సింగ్, హుజూరాబాద్ డీఎస్పీగా మాధవి, కామారెడ్డి డీఎస్పీగా శ్రీనివాసరావు, పటాన్ చెరు ఏసీపీగా ప్రభాకర్, సిద్దిపేట ఏసీపీగా రవీందర్ రెడ్డి, కూకట్‌పల్లి ఏసీపీగా రవికిరణ్ రెడ్డి, పేట్‌బషీర్‌బాద్ ఏసీపీగా బాలగంగిరెడ్డి, మహేశ్వరం ఏసీపీగా జానకిరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీగా లక్ష్మీనారాయణ సహా మొత్తం 77 మందిని డీజీపీ బదిలీ చేశారు.

## కొండారెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు



సీఎం రేవంత్ రెడ్డి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో కుటుంబ సమేతంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అర్చకులు ముఖ్యమంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. సీఎం రాక సందర్భంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, లోక్‌సభ సభ్యులు మల్లు రవి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌కు గూఢచర్యం.. రెండు వారాల్లో 12 మంది అరెస్టు



పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెండు వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 12 మందిని అరెస్టు చేశారు. పంజాబ్‌లో ఆరుగురు, హరియాణాలో ఐదుగురు, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులు పాక్ నిఘావర్గాలకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందన్నారు. వారి ఆర్థిక లావాదేవీలను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ కూడా జరుగుతోందని చెప్పారు.

* మే 4న పంజాబ్‌లోని అజ్నాలా, అమృత్‌సర్‌లకు చెందిన ఫలక్‌షేర్ మసిహ్, సూరజ్ మసిహ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతాలు, వైమానిక స్థావరాల ఫొటోలు, బలగాల కదలికలు, బీఎస్ఎఫ్ క్యాంపుల లొకేషన్లు తదితర సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్ నిఘాసంస్థ 'ఐఎస్ఐ'కు చేరవేస్తున్నారనే ఆరోపణలున్నాయి.
* మే 11న పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన గుజాలా అనే యువతి, యామిన్ మహమ్మద్ అరెస్టయ్యారు. దిల్లీలోని పాక్ హైకమిషన్‌లో పనిచేసి, ఇటీవల బహిష్కరణకు గురైన ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. రహస్య సమాచారం చేరవేతకు బదులుగా ఆన్‌లైన్‌లో డబ్బు పొందుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.
* మే 15న పంజాబ్‌కు చెందిన సుఖ్‌ప్రీత్ సింగ్, కరణ్‌బీర్ సింగ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన రహస్య సమాచారాన్ని, బలగాల కదలికలను, వ్యూహాత్మక ప్రాంతాల సమాచారాన్ని ఐఎస్ఐకు చేరవేసినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ఇదే రోజు హరియాణాలోని పానిపత్ జిల్లాలో 24 ఏళ్ల నౌమాన్ ఇలాహి అరెస్టయ్యాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కైరానాకు చెందిన అతడు ఐఎస్ఐతో సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు.
* మే 16న హరియాణాలోని కైథల్ జిల్లాకు చెందిన దేవేందర్ సింగ్ అరెస్టయ్యాడు. ఆయుధాలతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడనే ఆరోపణలతో అదుపులోకి తీసుకున్నారు. పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న అతడు.. గతేడాది పాకిస్థాన్‌కు వెళ్లాడని, ఈ క్రమంలోనే అక్కడి నిఘావర్గాలతో పరిచయం ఏర్పరుచుకుని.. వారితో టచ్‌లో ఉన్నాడని పోలీసులు ఆరోపించారు. పటియాలా కంటోన్మెంట్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను పంపినట్లు అతడు అంగీకరించాడన్నారు.
* మే 16నే హరియాణాలోని హిసార్‌కు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అరెస్టు చేశారు. పహల్గాం దాడికి ముందు ఆమె పలుమార్లు పాకిస్థాన్‌లో పర్యటించిందని, ఒకసారి చైనాకూ వెళ్లొచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో డానిష్‌తో ఆమె టచ్‌లో ఉన్నట్లు నిర్ధరించారు. పహల్గాం ఘటనకు ముందు అక్కడికి వెళ్లి వీడియోలు తీసినట్లు సమాచారం. ఆ సమాచారాన్ని పాక్ ఏజెంట్లకు చేరవేసి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.
* మే 17న హరియాణాలోని నుహ్ జిల్లాలో 26 ఏళ్ల అర్మాన్ అరెస్టయ్యాడు. పాక్ హైకమిషన్‌లోని ఉద్యోగి ద్వారా భారత సైన్యం, ఇతర సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పంచుకున్నందుకు అతడిపై చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం నుహ్ పోలీసులు మరో వ్యక్తినీ అరెస్టు చేశారు.
* మే 18న సరిహద్దు అక్రమ రవాణా, గూఢచర్యం ఆరోపణలపై షెహజాద్ అనే వ్యక్తిని ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాంపుర్‌లో మొరాదాబాద్ యూనిట్ ఎస్‌టీఎఫ్ అరెస్టు చేసింది. జాతీయ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఐఎస్ఐకు చేరవేస్తున్నాడని తెలిపింది. అనేకసార్లు పాక్‌కు ప్రయాణించి సౌందర్య సాధనాలు, దుస్తులు, సుగంధ ద్రవ్యాలు ఇతర వస్తువులను అక్రమంగా రవాణా చేస్తున్నాడని ఆరోపించింది.





## మేం పాక్‌కు ముందే చెప్పలేదు.. తప్పుగా ప్రచారం చేస్తున్నారు: విదేశాంగ శాఖ

ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల పాక్ అప్రమత్తం అయ్యిందని కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ కొట్టిపడేసింది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తొలి దశలో పాక్ సహా ఇతర దేశాలకు సమాచారం ఇచ్చామని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపినట్లు పేర్కొంది. కానీ దాడికి ముందే ఈ సమాచారం బయటకు వెళ్లినట్లు కాంగ్రెస్ అసత్య ఆరోపణలు చేస్తుందని తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం జైశంకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పింది.భాజపా రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. రాహుల్ తమ ప్రభుత్వంపై నిందలు మోపాలనే దురుద్దేశంతోనే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌పై బ్రీఫింగ్ ఇస్తూ.. మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చేసిన ప్రకటనను ఆ పార్టీ ఉటంకించింది. ఆపరేషన్ ప్రారంభించిన వెంటనే తాము ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నట్లు పాక్‌కు చెప్పడానికి ప్రయత్నించగా.. భవిష్యత్తులో ఆ దాడులకు తాము తీవ్ర సమాధానం ఇస్తామని దాయాది దేశం చెప్పినట్లు లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నట్లు భాజపా తెలిపింది. జైశంకర్ విదే శాల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆయనపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడింది. పీఐబీ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) సైతం కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చింది. కేంద్రమంత్రి ఈ ప్రకటన చేయలేదని తన ఫ్యాక్ట్‌చెక్‌లో పేర్కొంది. రాహుల్ గాంధీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ప్రారంభానికి ముందే ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లపై దాడి చేస్తున్నామని.. పాక్ సైన్యం వాటికి దూరంగా ఉండాలని భారత్ చెప్పినట్లు జైశంకర్ పేర్కొన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అలా చేయడం వల్ల దాయాది దేశం ముందుగానే అప్రమత్తమయ్యిందని ఆరోపించారు.

## ఆశ్రయం ఇచ్చేందుకు భారత్ ధర్మసత్రం కాదు

**: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

దిల్లీ: ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మన దేశంలో ఆశ్రయం కోరుతూ శ్రీలంక జాతీయుడు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. అసలేం జరిగిందంటే.. నిషేధిత సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)తో సంబంధాలున్నాయని ఆరోపణలతో 2015లో శ్రీలంకకు చెందిన ఓ వ్యక్తిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద 2018లో అతడిని దోషిగా తేలుస్తూ 10 ఏళ్ల శిక్ష ఖరారు చేసింది. అనంతరం ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా.. శిక్షను ఏడేళ్లకు తగ్గిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, శిక్ష పూర్తి కాగానే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది.

## జమ్ముకశ్మీర్ సమస్యలపై మాట్లాడే అర్హత ఏ ఇతర దేశానికీ లేదు : విదేశాంగ శాఖ



భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంఘర్షణ ఎల్లప్పుడూ సంప్రదాయ విధానంలోనే ఉందని, అణు దాడుల గురించి దాయాది నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. భారత్‌పాక్ ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ గురించి విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘానికి మిస్రీ వివరించారు. కాల్పుల విరమణ నిర్ణయం ద్వైపాక్షిక స్థాయిలోనే తీసుకున్నారని పునరుద్ఘాటించారు. ఈ వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదనలను కొంతమంది ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తగా.. మిస్రీ ఈమేరకు స్పందించారు. ''పహల్గామ్ దాడి ఘటనపై దర్యాప్తులో కీలక వివరాలు వెల్లడయ్యాయి. పాక్‌లోని సూత్రధారులతో ఉగ్రవాదులు సంభాషించినట్లు దర్యాప్తులో తేలింది. ఉగ్రవాదులు పాక్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. భారత్‌పై హింసను ప్రేరేపిస్తున్నారు. పాక్ సీమాంతర ఉగ్రవాదం గురించి భారత్ ఆందోళన చెందుతోంది. జమ్ముకశ్మీర్ సమస్యలపై మాట్లాడే అర్హత ఏ ఇతర దేశానికీ లేదు'' అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు.

## పదేళ్లకే పిల్లల్లో బీపీ, మధుమేహం.. కారణం ఇదే!

**: డాక్టర్ రిమా దాదా**



దిల్లీ: విద్యార్థుల్లో అధిక మధుమేహాన్ని నియంత్రించడమే లక్ష్యంగా పాఠశాలల్లో 'షుగర్ బోర్డు'లను ఏర్పాటు చేయాలని సీబీఎస్ఈ ఇటీవల ఆదేశించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై తాజాగా దిల్లీ ఎయిమ్స్ మీడియా విభాగం ఇంఛార్జి, అనాటమీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రిమా దాదా స్పందించారు. ''ఇది ఎంతో కీలకమైన ఆదేశం. పదేళ్ల వయసున్న పిల్లల్లో అధిక రక్తపోటు, మధుమేహం అభివృద్ధి చెందుతున్నాయి. ఇందుకు కారణం వారు పాటిస్తున్న అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లే. పిల్లల రోజువారీ ఆహారంలో చక్కెరలు 5శాతం కంటే మించరాదు. కానీ అది 15శాతం, అంతకన్నా ఎక్కువగా ఉంటోంది. తల్లిదండ్రులు, పిల్లలకు దీని గురించి తెలియదు. వారికి అవగాహన కూడా లేదు.'' ''పాఠశాలల్లో క్యాండీలు, ఇతర చక్కెర పదార్థాలు అందుబాటులో ఉండటంతో పిల్లలు వాటినే తింటున్నారు. పాఠశాల క్యాంటీన్లలో ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచాలి. పిల్లలకు వైవిధ్యమైన ఆహారం ఇవ్వాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆరోగ్యకరమైన గింజలు, తృణధాన్యాలు వంటివి ఇవ్వడంపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలి. తద్వారా పిల్లల శారీరక ఆరోగ్యానికే కాదు.. మానసిక ఆరోగ్యానికీ మేలు జరుగుతుంది. సీబీఎస్ఈ ఇచ్చిన ఆదేశాలు స్వాగతించాలి'' అని ఆమె తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సీబీఎస్ఈ బోర్డు ఇటీవల కీలక ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. అధిక చక్కెర వినియోగాన్ని తగ్గించేలా విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు పాఠశాలల్లో 'చక్కెర బోర్డులు' ఏర్పాటు చేయాలని అనుబంధ పాఠశాలలకు సూచించింది. ఇటీవలి కాలంలో పిల్లల్లో టైప్ 2 మధుమేహం కేసులు పెరుగుతున్న వేళ చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. పాఠశాల పరిసరాల్లో విక్రయించే చిరుతిళ్లు, శీతల పానీయాలు, ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో చక్కెర వినియోగం పెరుగుతోందని, దీంతో వారిలో మధుమేహంతో పాటు ఊబకాయం, దంత సమస్యలవంటి రుగ్మతలు పెరుగుతున్నాయని సీబీఎస్ఈ పేర్కొంది.

## జన్ సురాజ్ పార్టీ తొలి జాతీయ అధ్యక్షుడిగా ఉదయ్ సింగ్

**: ప్రశాంత్ కిశోర్ ప్రకటన**



పట్నా: ఎన్నికల ప్రచార వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు. తాను స్థాపించిన రాజకీయ పార్టీకి తొలి జాతీయ అధ్యక్షుడిగా మాజీ ఎంపీ ఉదయ్ సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. పట్నాలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇకపై తాను ప్రజలకు చేరువయ్యే అంశంపై దృష్టిసారించనున్నట్లు తెలిపారు. పార్టీని నడిపించే బాధ్యతను ఉదయ్‌సింగ్, ఆర్‌సీపీ సింగ్...తదితర నేతలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన తన పాదయాత్రను మంగళవారం నుంచే పునఃప్రారంభించనున్నట్లు ఈసందర్భంగా ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. గతేడాది అక్టోబర్ 2న ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీని ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ పార్టీ పూర్తిస్థాయి అధ్యక్షుడు లేకుండానే పనిచేస్తోంది. తాను ఏ పదవినీ ఉంచుకోనంటూ గతంలోనే స్పష్టం చేసిన ప్రశాంత్ కిశోర్.. పార్టీ ఏర్పాటైన వెంటనే మాజీ ఐపీఎస్ అధికారి మనోజ్ భారతిని జన్ సురాజ్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రకటించిన విషయం తెలిసిందే.

## టెలికాం కంపెనీలకు షాక్ ఇచ్చిన 'సుప్రీం'..

**ఆ పిటిషన్లను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం..!**




**న్యూఢిల్లీ:** ప్రముఖ టెలికాం కంపెనీలకు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిలను మాఫీ చేయాలని కోరుతూ వొడాఫోన్, ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ దాఖలు చేసిన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. జస్టిస్ జేబీ పార్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ సందర్భంగా మాట్లాడుతూ తమ మందుకు వచ్చిన ఈ పిటిషన్లను చూసి నిజంగానే షాక్ అయ్యామన్నారు. మల్టినేషనల్ కంపెనీ నుంచి కంపెనీని నుంచి ఇది ఊహించలేదని.. పిటిషన్‌ను కొట్టివేస్తామంటూ వొడాఫోన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి ధర్మాసనం తెలిపింది. కేంద్రం నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి ధర్మాసనం నిరాకరించింది. వొడాఫోన్ తన ఏజీఆర్ బకాయిల వడ్డీ, జరిమానా, జరిమానాపై వడ్డీగా సుమారు రూ.30వేలకోట్లను మాఫీ చేయాలని కోరింది. టెలికాం రంగంలో పోటీని కొనసాగించేందుకు సంస్థ మనుగడ ముఖ్యమని రోహత్గి గతంలో తెలిపారు. ఇటీవల బకాయి ఉన్న వడ్డీని ఈక్విటీ మార్పిడి తర్వాత కేంద్రం ఇప్పుడు కంపెనీలో 49 శాతం వాటాను కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుత రిట్ పిటిషన్ తీర్పును సమీక్షించాలని కోరడం లేదని.. కానీ తీర్పు ప్రకారం వడ్డీ, జరిమానా, జరిమానాపై వడ్డీ చెల్లింపు నుంచి మినహాయింపులు కోరుతున్నట్లు కంపెనీ పిటిషన్‌లో పేర్కొంది. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, జరిమానా, జరిమానాపై వడ్డీని చెల్లించాలని పట్టుబట్టకుండా తగిన దిశా నిర్దేశం చేయాలని కోరారు. అలాగే, భారతీ ఎయిర్‌టెల్ సైతం రాయితీలను కోరుతూ అప్పీల్ చేసుకుంది. అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్‌తో కలిసి రూ.34,745 కోట్ల విలువైన వడ్డీ, జరిమానాల మినహాయింపులను కోరింది.అయితే, 2020 సెప్టెంబర్ 1 నాటి ఏజీఆర్ తీర్పును తాము వ్యతిరేకించడం లేదని, జరిమానాలు, పేరుకుపోయిన వడ్డీ తదితర అదనపు భారం నుంచి మాత్రమే ఉపశమనం కోరుతున్నట్లు కంపెనీ పేర్కొంది. వోడాఫోన్ సైతం తాము దివాలా అంచున ఉన్నామని.. కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం అందకపోతే 2025-26 ఆర్థిక సంవత్సరంలో కొనసాగించలేమని తెలిపింది. రూ.26వేల కోట్ల ఈక్విటీ ఇన్ఫ్యూషన్, ప్రభుత్వం బకాయిలను ఈక్విటీగా మార్చినప్పటికీ బ్యాంకు నిధులను పొందడంలో ఇబ్బందులున్నాయని.. ప్రభుత్వ జోక్యం లేకుండా, నిధులను సేకరించలేమని, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఎదుట దివాలా ప్రక్రియను ప్రారంభించాల్సి రావచ్చని కంపెనీ పేర్కొంది. దివాలా కారణంగా కంపెనీలోని కేంద్ర ప్రభుత్వం 49శాతం వాటా నిరుపయోగమవుతుందని.. ఇప్పటికే ఈక్విటీగా మార్చిన స్పెక్ట్రమ్ బకాయిలు రూ.1.18 లక్షల కోట్లు వృధా అవుతాయని వొడాఫోన్ ఐడియా పేర్కొంది.

## ఐటీ కంపెనీల ఎఫెక్ట్...

**నష్టాల్లో ముగిసిన మార్కెట్లు**

**అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు**

**271 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 85.40**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో పాటు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణతో మార్కెట్లు నష్టపోయాయి. ఐటీ కంపెనీల షేర్లు ఒత్తిడికి గురి కావడం కూడా నష్టాలకు మరో కారణం. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 271 పాయింట్లు నష్టపోయి 82,059కి పడిపోయింది. నిఫ్టీ 74 పాయింట్లు కోల్పోయి 24,945 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 85.40గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్**

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (1.27%), బజాజ్ ఫైనాన్స్ (0.95%), ఎన్టీపీసీ (0.58%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.39%), హెచ్డీఎఫ్సీ బ్యాంక్ (0.26%).

**టాప్ లూజర్స్**

ఇన్ఫోసిస్ (-1.92%), టీసీఎస్ (-1.23%), టెక్ మహీంద్రా (-1.19%), రిలయన్స్ (-1.03%), ఏషియన్ పెయింట్స్ (-1.01%).

## యూకే కుబేరుల జాబితాలో హిందుజా హవా..

**నాలుగోసారీ భారత సంతతిదే అగ్రస్థానం**



**న్యూఢిల్లీ:** 110 ఏళ్ల క్రితం ప్రారంభమైన హిందుజా గ్రూప్ ప్రస్తుతం 38 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా రవాణా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ టెక్నాలజీ, మీడియా, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, లూబ్రికెంట్స్, స్పెషాలిటీ కెమికల్స్, ఎనర్జీ, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వైద్య రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టింది. 'సండే టైమ్స్' ప్రచురించే ఈ ప్రతిష్ఠాత్మక జాబితా బ్రిటన్‌లో నివసిస్తున్న 350 అత్యంత ధనవంతులు వారి కుటుంబాల ఆస్తులను లెక్కిస్తుంది. భూమి, ఆస్తులు, ప్రభుత్వ రంగ కంపెనీల షేర్లు, ఇతరత్రా లెక్కించదగిన సంపద ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తారు. "హిందుజా కుటుంబం బ్రిటన్ కుబేరుల జాబితాలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. వారి వ్యాపార సామ్రాజ్యం పరిమాణంలోనే కాకుండా, పరిధిలోనూ విస్తరిస్తోంది" అని 'టైమ్స్' పేర్కొంది.

గత ఏడాది కాలంలో హిందుజా గ్రూప్ భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల రంగంపై మరింత దృష్టి సారించింది. దేశంలో స్థిరమైన రవాణాకు ప్రోత్సాహం లభిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి గణనీయమైన నిధులను కేటాయించింది. ఇది ఆటోమొబైల్ రంగంలో వారి సంస్థ తీసుకుంటున్న 'గ్రీన్' మార్పును సూచిస్తోంది.

"మా ఆవిష్కరణల ఆధారిత వృద్ధి లక్ష్యానికి అనుగుణంగా, భవిష్యత్తు రవాణా స్థిరమైన సాంకేతికతల్లో పెట్టుబడులు పెడుతున్నాం" అని లండన్‌లో జరిగిన ఒక పరిశ్రమ సదస్సులో గ్రూప్ ప్రతినిధి తెలిపారు. అంతేకాకుండా, అశోక్ లేలాండ్ ఛైర్మన్ ధీరజ్ హిందుజా 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ, 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో హిందుజా లేలాండ్ ఫైనాన్స్‌ను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.



# లక్నోకు లక్కు లేదు..

**ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ఐదో జట్టుగా లక్నో సూపర్ జెయింట్స్ నిలిచింది. సోమవారం సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. దీంతో టోర్నీలో ఏడో ఓటమిని నమోదు చేసింది. సన్ రైజర్స్ హైదరాబాద్.. నాలుగో విజయాన్ని రుచి చూసింది.**



**పోతూ పోతూ పంత్ టీమ్‌ను ఇంటికి తీసుకెళ్లిన సన్‌రైజర్స్!**

**లక్నో:** ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి లక్నో సూపర్ జెయింట్స్ నిష్క్రమించింది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సన్ రైజర్స్ చేతిలో లక్నో ఆరు వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. దీంతో ఈ ఎడిషన్‌లో ఏడో ఓటమిని నమోదు చేసింది. మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగానే ప్లే ఆఫ్స్ రేసు నుంచి దూరమైంది.

లక్నోలోని ఏకనా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 రన్స్ స్కోరు చేసింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (65), ఎయిడెన్ మార్క్రమ్ (61) హాఫ్ సెంచరీలతో రాణించారు. సన్ రైజర్స్ బౌలర్లలో ఇషాన్ మలింగ 2, హర్ష్ దూబే 1, హర్షల్ పటేల్ 1, నితీశ్ కుమార్ రెడ్డి ఒక వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఓపెనర్ అభిషేక్ శర్మ అదిరే ఆరంభం ఇచ్చాడు. 20 బంతుల్లో 59 రన్స్ స్కోరు చేసి సన్‌రైజర్స్ ఛేజింగ్‌కు బలమైన పునాది వేశాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (35), హెన్రిచ్ క్లాసెన్ (47), కామిందు మెండిస్ (32 రిటైర్డ్ హర్ట్) రాణించారు. దీంతో మరో 10 బంతులు మిగిలి ఉండగానే సన్‌రైజర్స్ ఛేజింగ్‌ను పూర్తి చేసింది. లక్నో బౌలర్లలో దిగ్వేష్ రాథీ 2, విలియమ్ ఒరుర్కే 1, శార్దూల్ ఠాకూర్ 1 వికెట్ పడగొట్టారు.

కాగా ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సన్ రైజర్స్ హైదరాబాద్ సోమవారం గెలిచి.. లక్నో సూపర్ జెయింట్స్‌ను కూడా ఇంటికి తీసుకెళ్లింది. దీంతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ఐదో టీమ్‌గా లక్నో నిలిచింది. ఇప్పటికే గుజరాత్ టైటాన్స్, ఆర్సీబీ, పంజాబ్ ప్లే ఆఫ్స్ చేరాయి. మిగిలిన ఒక్క బెర్తు కోసం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య పోటీ నెలకొంది.

## ప్లే ఆఫ్స్ కింగ్ 'అయ్యర్'.. ఐపీఎల్ చరిత్రలో తొలి కెప్టెన్‌గా రికార్డు..!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో అత్యుత్తమ ఆటతోనే కాదు కెప్టెన్సీతోనూ రికార్డు బద్దలు కొడుతున్నాడు శ్రేయాస్ అయ్యర్. నిరుడు కోల్‌కతా రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన అయ్యర్.. ఈసారి పంజాబ్ కింగ్స్‌ను టైటిల్‌కు మరింత చేరువ చేశాడు. అతడి సారథ్యంలో అదరగొడుతున్న పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. దాంతో, ఐపీఎల్ చరిత్రలోనే మూడు జట్లను ప్లే ఆఫ్స్ తీసుకెళ్లిన తొలి కెప్టెన్‌గా శ్రేయాస్ రికార్డు సృష్టించాడు. సారథిగా అతడు నాలుగు సీజన్లలో ప్లే ఆఫ్స్ ఆడనున్న సారథి కూడా అతడే కావడం విశేషం. పొట్టి ఫార్మాట్‌లో పరుగుల వరద పారిస్తున్న అయ్యర్.. ఐపీఎల్ కెప్టెన్‌గానూ విజయవంతం అయ్యాడు. 2019లో ఢిల్లీ క్యాపిటల్స్ సారథిగా వ్యవహరించిన అతడు జట్టును ప్లే ఆఫ్స్ చేర్చాడు. ఆ తర్వాత సీజన్‌లోనూ తన నాయకత్వ పటిమతో ఆకట్టుకున్న అయ్యర్ ఢిల్లీని ప్లే ఆఫ్స్ తీసుకెళ్లాడు. 17వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ పగ్గాలు అందుకున్న అయ్యర్.. తన మార్క్ కెప్టెన్సీతో జట్టును గెలుపు తోవలో నడిపాడు. లీగ్ దశలో అన్ని జట్లకు షాకిస్తూ కోల్‌కతా ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. నాకౌట్ పోరులోనూ అదే జోరు చూపించిన అయ్యర్ బృందం మూడోసారి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే.. కోల్‌కతా టైటిల్ క్రిడిట్ అంతా మెంటార్ గౌతం గంభీర్‌కు వెళ్లడంతో చిన్నబుచ్చుకున్న అయ్యర్.. జట్టుతో కొనసాగేందుకు అభ్యంతరం తెలిపి మెగా వేలానికి వచ్చాడు. యూఏఈలో జరిగిన ఆక్షన్‌లో ఈ యంగ్‌స్టర్ అందరూ ఊహించినట్టే రికార్డు ధర పలికాడు. నాయకుడిగా అతడి అనుభవం తమ జట్టుకు పనికొస్తుందనుకున్న పంజాబ్ రూ.26.75 కోట్లు చెల్లించి మరీ అయ్యర్‌ను దక్కించుకుంది.

## ఒకప్పుడు నెట్ బౌలర్.. ఇప్పుడు ఆర్సీబీ ప్రధాన పేసర్!



**బెంగళూరు:** ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి టైటిల్‌పై గురి పెట్టింది. గతంలో మూడుసార్లు ఆఖరి మెట్టుపై తడబడిన ఆర్సీబీ ఈసారి కప్ కలను సాకారం చేసుకోవాలనే కసితో ఉంది. అందుకోసమే.. కీలకమైన ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు పేస్ దళాన్ని పటిష్టం చేసుకునే పనిలో పడింది. లీగ్ మ్యాచ్‌ల తర్వాత ప్రధాన పేసర్లు లుంగి ఎంగిడి జట్టును వీడనున్న నేపథ్యంలో అతడి స్థానాన్ని పేస్ సంచలనంతో భర్తీ చేసింది.

జింబాబ్వేకు చెందిన బ్లెస్సింగ్ ముజరబనికి తమ స్క్వాడ్‌లో చోటు కల్పించింది. ఈ విషయాన్ని ఆర్సీబీ యాజమాన్యం సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'ఆరు అడుగుల 8 అంగుళాల పొడవుండే బ్లెస్సింగ్ ముజరబని తాత్కాలిక ప్లేయర్‌గా స్క్వాడ్‌తో కలువనున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ స్క్వాడ్‌కు ఎంపికైన లుంగి ఎంగిడి మే 26న స్వదేశం వెళ్లనున్నాడు.

# ఆసియా కప్ నుంచి తప్పుకున్న బీసీసీఐ

**న్యూఢిల్లీ:** ఇండియా, పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకున్నది. ఆసియా క్రికెట్ మండలి నిర్వహించే అన్ని క్రికెట్ టోర్నీలకు దూరంగా ఉండేందుకు ఇండియా డిసైడైంది. దీంతో పాకిస్థాన్‌ను ఏకాకిని చేయాలన్న ఉద్దేశంతో బీసీసీఐ కసరత్తులు చేస్తోంది. మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ఇప్పటికే ఏసీసీకి బీసీసీఐ చెప్పింది. ఆ టోర్నీని వచ్చే నెలలో శ్రీలంకలో నిర్వహించనున్నారు. ఇక సెప్టెంబర్‌లో జరగనున్న పురుషుల ఆసియా కప్ టోర్నీ నుంచి కూడా ఇండియా తప్పుకున్నట్లు బీసీసీఐ పేర్కొన్నది. వాస్తవానికి ఆ టోర్నీని ఇండియానే నిర్వహించాల్సి ఉంది.

ఆసియా క్రికెట్ మండలి ప్రస్తుతం అధిపతిగా మోషిన్ నఖ్వీ ఉన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మెన్ కూడా ఆయనే. పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఆయన పనిచేస్తున్నారు. ఏసీసీ చీఫ్ ఓ పాకిస్థాన్ మంత్రి, అలాంటి వ్యక్తి నేతృత్వంలో జరిగే టోర్నీల్లో ఇండియా






పాల్గొనబోదని బీసీసీఐ పేర్కొన్నది. టోర్నీల నుంచి తప్పుకున్న విషయాన్ని ఏసీసీకి చెప్పామని, కేంద్ర ప్రభుత్వంతో నిత్యం టచ్‌లో ఉన్నట్లు బీసీసీఐ పేర్కొన్నది.

ఇండియా తప్పుకోవడంతో ఆసియా కప్ టోర్నీపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. ఎందుకంటే ఆ టోర్నీకి ఈసారి ఇండియానే ఆతిథ్యం ఇవ్వాల్సి ఉన్నది. ఆసియా కప్ ప్రసార హక్కులను గత ఏడాది సోనీ పిక్చర్స్ నెట్వర్క్ సుమారు 17 కోట్ల డాలర్లకు 8 ఏళ్ల కోసం కొనుగోలు చేసింది. ఒకవేళ టోర్నీ రద్దు అయితే, అప్పుడు ఆ డీల్ గురించి సోనీ వర్కౌట్ చేయాల్సి ఉంటుంది.

ఇండోపాక్ ఉద్రిక్తతల వేళ గతంలో కూడా ఆసియాకప్‌పై ప్రభావం చూపాయి. 2023లో పాకిస్థాన్‌కు భారత జట్టును బీసీసీఐ పంపలేదు. దీంతో ఆ టోర్నీని తటస్థ వేదిక శ్రీలంకలో నిర్వహించారు. ఇండియా అక్కడే అన్ని మ్యాచ్‌లు ఆడింది. ఇలాగే ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీ కోసం కూడా హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించారు.




# వాటే లక్కీ బ్యూటీ..

## అప్పుడు స్టార్ హీరో సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్.. ఇప్పుడు ఇదే హీరో పక్కన హీరోయిన్‌గా..

టాకీస్: చాలా మంది హీరోయిన్స్ చైల్డ్ ఆర్టిస్ట్ లుగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. స్టార్ హీరోల సినిమాల్లో ఎంతో మంది నటీనటులు చైల్డ్ ఆర్టిస్ట్ లుగా నటించి అలరించారు. ఇక వరుస చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్టులుగా నటించి తమకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కట్ చేస్తే ఇప్పుడు హీరోహీరోయిన్లుగా వెండితెరపై సత్తా చాటుతున్నారు. ఇప్పటికే తెలుగులో తేజా సజ్జా.. హీరోగా మారి ఆతర్వాత హనుమాన్ సినిమాతో స్టార్ డమ్ అందుకున్నాడు. అటు సంతోష్ శోభన్, సంగీత్ శోభన్, శ్రీవిధ్య, కావ్య కళ్యాణ్ రామ్, అనిక సురేంద్రన్, ఎస్తేర్ అనిల్.. ఇలా చాలా మంది చిన్నప్పుడు తమ నటనతో ఆకట్టుకుని.. ఇప్పుడు వెండితెరపై మెయిన్ లీడ్స్ పోషిస్తున్నారు. ఇప్పుడు ఈ హీరో, హీరోయిన్స్ అందరూ వరుస సినిమాలతో దూసుకు పోతున్నారు. ఆ ముద్దుగుమ్మ ఎవరో కాదు.. కృతి శెట్టి. ఈ చిన్నది తెలుగు, తమిళ సినిమాల్లో పని చేస్తూ బిజీగా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ 2003 సెప్టెంబరు 21న కర్ణాటకలోని మంగళూరులో జన్మించింది, ముంబైలో పెరిగింది. ఆమె తండ్రి కృష్ణ శెట్టి వ్యాపారవేత్త, తల్లి నీతి శెట్టి ఫ్యాషన్ డిజైనర్. చిన్నతనం కృతి శెట్టి ఐడియా, పార్లే, లైఫ్‌బాయ్ వంటి పలు బ్రాండ్‌ల వాణిజ్య ప్రకటనల్లో నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ తన కెరీర్ ను చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. కృతి 2019లో హిందీ చిత్రం సూపర్ 30లో చిన్న పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. అంతకు ముందు కార్తీ హీరోగా నటించిన నా పేరు శివ సినిమాలో ఇలా కనిపించి అలా వెళ్ళింది కృతిశెట్టి. ఇక ఇప్పుడు ఆమె హీరోయిన్‌గా మారి సినిమాలు చేస్తుంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం కార్తీ హీరోగా నటిస్తున్న సినిమాలో ఆయన సరసన హీరోయిన్ గా చేస్తుంది. వా వాతియార్ అనే సినిమాలో కార్తీకి జోడీగా కృతిశెట్టి నటిస్తుంది. నలన్ కుమారసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక కృతిశెట్టి కార్తీ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇప్పుడు హీరోయిన్ గా నటించడం పై సోషల్ మీడియాలో కొన్ని మీమ్స్ వైరల్ అవుతున్నాయి.



# మహా భారతంలో కృష్ణుడి పాత్ర చేయాలని ఉంది

## నటుడు జూనియర్ ఎన్టీఆర్ మనోగతం

**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్ పెద్ద ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నాడు. దేవర మూవీతో మంచి హిట్ అందుకున్న ఆయన.. ఇప్పుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో భారీ సినిమా చేస్తున్నాడు. డ్రాగన్ అనే పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతానికి షూటింగ్ జరుగుతోంది. తర్వత దేవర-2, ఆ తర్వాత నెల్సన్ తో మూవీ ఉండొచ్చు. ఎన్టీఆర్ అంటే నటనకు మారుపేరు. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం ఆయనకు చాలా సులువు. ఎన్టీఆర్ నటనను ఎంతో మంది డైరెక్టర్లు మెచ్చుకున్నారు. ఇప్పటికే ఎన్నో వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించి మెప్పించాడు ఎన్టీఆర్. అలాంటి నటన కనబరిచే ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ ఏంటో చాలా మందికి తెలియదు. ఎన్టీఆర్ కు ఉన్న ఒకే ఒక్క డ్రీమ్ రోల్ మహాభారతంలో కృష్ణుడి పాత్ర చేయడం. ఆ విషయంలో గతంలో కూడా బయటపెట్టాడు ఎన్టీఆర్. దర్శక ధీరుడు రాజమౌళి మహాభారతం సినిమాను తీస్తానని గతంలోనే ప్రకటించాడు. కాకపోతే దానికి చాలా సమయం పడుతుందన్నాడు. ఒకవేళ జక్కన్న ఈ మూవీ తీస్తే అందులో ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ లో నటిస్తాడేమో చూడాలి. ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు జూనియర్. మొన్ననే త్రిబుల్ ఆర్ కాన్సర్ట్‌లో పాల్గొని వచ్చాడు.




## కుర్ర హీరోయిన్స్‌కు గట్టిపోటీ ఇస్తున్న

# మన్మథుడు బ్యూటీ అన్షు అంబానీ

టాకీస్: నటి అన్షు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ముద్దుగుమ్మ మన్మథుడు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. అక్కినేని నాగార్జున సరసన నటించిన ఈ తెలుగు రొమాంటిక్ కామెడీ సినిమాతో ఆమె గుర్తింపు పొందింది. ఈ చిత్రంలోని "గుండెల్లో ఏముందో" పాటలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత ఆమె ప్రభాస్ సరసన రాఘవేంద్ర సినిమాలో నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత ఓ తమిళ్ సినిమాలోనూ నటించింది ఈ చిన్నది. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ చిన్నది ఇటీవలే తిరిగి రీ ఎంట్రీ ఇచ్చింది. 21 సంవత్సరాల విరామం తర్వాత, ఆమె సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్‌లతో కలిసి "మజాకా" చిత్రంతో తెలుగు సినిమాల్లోకి తిరిగి అడుగుపెట్టింది. ఈ చిత్రం ఫిబ్రవరి 28, 2025న విడుదలైంది.ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. మజాకా సినిమా సూపర్ హిట్ కావడమే కాదు.. మరోసారి తన నటనకు మరోసారి ప్రశంసలు అందుకుంది. దీంతో ఇప్పుడు తెలుగులో మరిన్ని ఆఫర్స్ వస్తే చేసేందుకు రెడీగా ఉంది అన్షు. ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో అన్షు చాలా యాక్టివ్. నిత్యం తన ఫ్యామిలీతోపాటు తన క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు మోడ్రన్ డ్రస్ లో మరింత అందంగా కనిపిస్తుంది. వయ్యారాల సింగారంతో ఫాలోవర్లను కట్టిపడేస్తుంది ఈ చిన్నది.

## థియేటర్ యాజమాన్యాలతో

# ఎగ్జిబిటర్ల విభేదాలు

### జూన్ 1నుంచి థియేటర్ల బంద్ ఆలోచన




టాకీస్: తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని సినీ ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. రెంటల్ బేసిస్‌లో సినిమాలు ప్రదర్శించలేకపోవడంతో ఎగ్జిబిటర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. తమకు పర్సంటేజీ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఆది వారం ఏర్పాటు చేసిన సమావేశానికి నిర్మాతలు దిల్ రాజు, సురేశ్ బాబుతోపాటు 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. చాలా రోజులుగా పర్సంటేజీలపై ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చర్చ నడుస్తోంది. రెంటల్ పద్ధతిలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఓ వైపు ఎగ్జిబిటర్లు అంటుండగా.. మరోవైపు వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఎగ్జిబిటర్ల జాయింట్ మీటింగ్‌లో పర్సంటేజీ, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. నిర్మాతలకు ఇందుకు సంబంధించిన ఓ లేఖ రాయాలని సమావేశంలో తీర్మానించారు.

# కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు

## తెరంగేట్రానికి సిద్ధంగా రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ

టాకీస్: సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు అరంగేట్రం చేయబోతున్నాడు. పెద్ద కుమారుడు, రమేష్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా పరిచయం కానున్నారని, గత కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా సోషల్ మీడియాలో జయకృష్ణకు సంబంధించిన ఓ ఫొటో షూట్ బయటకు రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. బ్లాకసూట్‌లో మెస్మరైజింగ్‌లో లుక్‌లో కనిపించిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కాగా జయకృష్ణ లండన్‌లో నటనలో ప్రొఫెషనల్ -ట్రైనింగ్ తీసుకున్నాడు. అయితే తాజాగా జయకృష్ణను తెలుగు చిత్రసీమలో ఆవిష్కరించేందుకు దర్శకుడు సిద్ధం అయ్యాడు. ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' లాంటి చిత్రాలతో బోల్డ్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వం జయకృష్ణ ఎంట్రీ ఇవ్వనున్నట్లు- సమాచారం. వైజయంతీ మూవీస్, ఆనంది ఆర్ట్స్ ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మించనున్నాయి. అంటే ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఇద్దరు ప్రముఖ నిర్మాతలు సంయుక్తంగా నిర్మించనున్నారని తెలుస్తోంది. అయితే అజయ్ భూపతి మాత్రం ప్రస్తుతం 'మంగళవారం 2'తో బిజీగా ఉన్నప్పటికీ, జయకృష్ణ డెబ్యూ సినిమాను కూడా త్వరలో సెట్స్‌పైకి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నాడట. కాగా ఈ సినిమా కథ యాక్షన్, ఎమోషన్ తో యువతను ఆకర్షించేలా ఉంటుందని అంటున్నారు. అంతే కాదు మహేష్ బాబు ఈ ప్రాజెక్ట్‌ను దగ్గరుండి చూస్తూ, కొన్ని నిర్మాణ అంశాల్లో కీలక సలహాలు ఇస్తున్నాడని సమాచారం.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.